PRGI No : TGMUL/25/A1386

తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

చీఫ్ ఎడిటర్ : పస్తం సైదులు, సంపుటి : 03 సంచిక - 341 పేజీలు - 08 బుధవారం 04 నవంబర్ 2026

తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నిన్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై

సర్కారు దృష్టి

● మహారాష్ట్రతో నిరంతర చర్చలు జరపాలి ● ముంపు భూముల వివరాలు, పరిహారంపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి ● సాగునీటి శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై మహారాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూముల వివరాలు, పరిహారం చెల్లింపు, గతంలో కుదిరిన ఒప్పందాలు తదితర అంశాలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ విషయంలో ఎలాంటి సందిగ్ధత లేకుండా అవసరమైన పత్రాలను సిద్ధం చేసి మహారాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు.మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి తుమ్మిడిహెట్టి బ్యారేజీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ప్రాజెక్టుకు సంబంధించిన మిగతా2లో...

శాసనమండలి ప్రాంగణం అభివృద్ధికి

కార్యాచరణ

- పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యం: సీఎస్ సంజయ్ జాజు



అర్హులైన పేదలందరికీ

ఇందిరమ్మ ఇండ్లు

నియోజకవర్గానికి 5,500 ఇళ్లు.. ఉపాధి ఉన్న ప్రాంతాల్లోనే నిర్మాణాలు

వచ్చే బోనాల నాటికి గృహప్రవేశాలు..

ఈ-లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక



ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకులు

సృష్టించిన కరువు!

● కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతోనే రైతులకు సాగునీటి కష్టాలు ● గోదావరి, కృష్ణా నుంచి సముద్రంలోకి వృథాగా వెళ్తున్న వందల టీఎంసీల నీరు ● కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో నదులు ప్రవహిస్తున్నా రైతుల పొలాలకు సాగునీరు అందకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని ఆరోపించారు. కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను నిర్లక్ష్యం మిగతా2లో...



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పొడిగింపు

- నామినేషన్ల దాఖలు చివరి రోజు వరకు దరఖాస్తుకు అవకాశం

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువును పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తి పలువురు పట్టభద్రులు నమోదు మిగతా2లో...

ఏపీలో కూటమికే

పట్టం!

● పట్టణ స్థానిక సంస్థల్లో ఆధిక్యం!

● కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టీడీపీ కూటమి హవా

● జగన్ సొంత జిల్లా కడపలోనూ కూటమి ఆధిపత్యం

● నందికొట్కూరులో వైసీపీ విజయం.. అనంతపురంలో బీజేపీకి ఎదురుదెబ్బ



తొలి అక్షరం/అమరావతి,నవంబర్ 3: ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లో అధికార టీడీపీ నేతృత్వంలోని కూటమి ఆధిక్యం ప్రదర్శించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కూటమి అభ్యర్థులు మెజారిటీ స్థానాల్లో ముందంజలో నిలిచారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు పలు ప్రాంతాల్లో ఆధిక్యం కనబరిచారు. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కడపతో పాటు ఆయన సొంత నియోజకవర్గం పులివెందులలోనూ టీడీపీ కూటమి అభ్యర్థులు పైచేయి సాధించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. **కార్పొరేషన్లలో కూటమి ఆధిక్యం** రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపులో కూటమి అభ్యర్థులు మిగతా2లో...

కేసీఆర్ పాలనలో తెలంగాణ

సంపద దోపిడీ

- 74 వేల ఉద్యోగాలు కల్పించాం.. మరోసారి భూసర్వేకు చర్యలు: పొంగులేటి



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సంపదను స్వార్థ ప్రయోజనాల కోసం కొల్లగొట్టారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్న కేసీఆర్ పేదల కష్టాలను పట్టించుకోలేదని విమర్శించారు. ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లిలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. **మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తాం** ప్రతిపక్ష నేతలు తమ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. గతంలో వరి సాగు చేసే రైతులను నిరుత్సాహపరిచారని, మిగతా2లో...

సైబర్ నేర ముఠాలపై

ఉక్కుపాదం

- 13 రాష్ట్రాలు, 11 కేంద్ర సంస్థలతో హైదరాబాద్‌లో సమన్వయ సమావేశం



తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న సైబర్ నేర ముఠాలను కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ), తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని టీజీఐసీసీసీలో జాయింట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ టీమ్ (జేసీసీటీ-4) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి 13 రాష్ట్రాల నుంచి 45 మంది పోలీసు అధికారులు, 11 కేంద్ర, ఇతర సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య సమాచార మార్పిడి, సైబర్ నేరాల కేంద్రాల గుర్తింపు, నేర ముఠాలపై ఉమ్మడి దర్యాప్తు, సంయుక్త దాడులపై చర్చించారు. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సమావేశాన్ని ప్రారంభించగా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, మిగతా2లో...

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై సర్కారు దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

వివిధ అంశాలపై అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. అంతర్రాష్ట్ర సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటూ ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. **ముంపు భూములకు పరిహారం చెల్లించేందుకు సిద్ధం** బ్యారేజీ నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన నిధులను ఇరు రాష్ట్రాల ఉమ్మడి ఖాతాలో జమ చేసేందుకు కూడా సిద్ధమని తెలిపారు. ముంపునకు సంబంధించిన భూములపై మహారాష్ట్ర ప్రభుత్వం స్వయంగా సర్వే నిర్వహించినా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు.

అంతర్రాష్ట్ర సమన్వయానికి ప్రాధాన్యం

తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో మహారాష్ట్రతో సమన్వయం ఎంతో ముఖ్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆ రాష్ట్ర అధికారులు కోరిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని, గతంలో చేసుకున్న ఒప్పందాలు, ఇతర సాంకేతిక అంశాలకు సంబంధించిన పత్రాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. చర్చల్లో పురోగతి సాధించేలా నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టతతో ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో తెలంగాణ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్, ఈఎన్‌సీ రమేష్‌బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డబ్బులు జమయ్యాకే చెక్కుల పంపిణీ

● ఖేలో ఇండియా క్రీడాకారులకు ఇబ్బందులు పెట్టొద్దు.. అధికారుల సమన్వయ లోపంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షలో క్రీడాశాఖ అధికారుల తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖలో బాధ్యతారాహిత్యం, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. **నిధుల బదిలీ తర్వాతే చెక్కులు**



ఆర్థిక శాఖ నుంచి స్పోర్ట్స్ అథారిటీకి నిధులు బదిలీ అయిన తర్వాతే క్రీడాకారులకు చెక్కులు పంపిణీ చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఖాతాల్లో డబ్బులు లేకుండానే చెక్కులు ఇచ్చి క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని సూచించారు. నిధుల లభ్యతను నిర్ధారించుకున్న తర్వాతే చెక్కుల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. **క్రీడాకారులను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు** క్రీడాకారులు, వారి తల్లిదండ్రులను పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం మంచి పద్ధతి కాదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. క్రీడాకారులకు అందాల్సిన ప్రోత్సాహకాలు, ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం పెంచుకుని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఏపీలో కూటమికే పట్టం!

(మొదటి పేజీ తరువాయి)

ఆధిక్యంలో కొనసాగారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, నెల్లూరు, కడప, మచిలీపట్నం తదితర కార్పొరేషన్లలో కూటమి అభ్యర్థులు ముందంజలో నిలిచారు. విశాఖపట్నం మేయర్ అభ్యర్థిగా టీడీపీ తరఫున బరిలో ఉన్న ముక్కా శ్రావణి ఆధిక్యం సాధించారు. గుంటూరు, తిరుపతి, చిత్తూరు, మచిలీపట్నం కార్పొరేషన్లలోనూ టీడీపీ అభ్యర్థులు విజయం సాధించినట్లు ఫలితాలు వెల్లడయ్యాయి. **పులివెందులలో టీడీపీకి ఆధిక్యం** మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందుల మున్సిపాలిటీలో టీడీపీ కూటమి ఆధిక్యం సాధించడం ఎన్నికల ఫలితాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కడప జిల్లాలోని పలు పట్టణ స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులు విజయాలు నమోదు చేశారు. అయితే నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపాలిటీలో వైసీపీ విజయం సాధించింది. కొన్ని ప్రాంతాల్లో స్వతంత్ర అభ్యర్థులు కూడా గెలుపొందారు. **మున్సిపాలిటీల్లోనూ కూటమి హవా** రాష్ట్రంలోని 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో జరిగిన ఎన్నికల లెక్కింపులోనూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శించారు. టీడీపీ అత్యధిక స్థానాల్లో గెలుపొందగా, జనసేన, బీజేపీ అభ్యర్థులు కూడా పలు పట్టణాల్లో విజయాలు సాధించారు. వైసీపీ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే గెలుపొందింది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని పులివెందుల, ప్రొద్దుటూరు, పుంగనూరు వంటి పట్టణాల్లో కూటమి అభ్యర్థుల విజయాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. **వామపక్షాలకూ కొన్ని స్థానాలు** మరోవైపు వామపక్ష పార్టీలు కూడా కొన్ని ప్రాంతాల్లో తమ ఉనికిని చాటుకున్నాయి. గత ఎన్నికల్లో విశాఖపట్నం, విజయవాడ కార్పొరేషన్లలో గెలుచుకున్న ఒక్కో కార్పొరేటర్ స్థానాన్ని సీపీఐ(ఎం) నిలబెట్టుకుంది. మరికొన్ని మున్సిపాలిటీల్లో వార్డు సభ్యుల స్థానాలను సాధించింది. మొత్తంగా పట్టణ ప్రాంతాల్లో జరిగిన ఈ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించాయి. అధికార కూటమి, ప్రధాన ప్రతి పక్ష వైసీపీ మధ్య జరిగిన పోటీలో పలు కీలక ప్రాంతా ల్లో కూటమి ఆధిక్యం సాధించింది. మిగిలిన స్థానాల లెక్కింపు, తుది ఫలితాలతో పూర్తి రాజకీయ చిత్రం స్పష్టమైంది.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : రాష్ట్రంలో గుడిసెలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని బీసీ సంక్షేమ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నాంపల్లిలోని గృహకల్ప కార్యాలయంలో గోషామహల్, చాంద్రాయణగుట్ట, ఎల్బీనగర్, ముషీరాబాద్ నియోజకవర్గాల లబ్ధిదారుల ఎంపికకు కంప్యూటరైజ్డ్ ఈ-లాటరీ నిర్వహించారు. ఎంపికైన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. **నియోజకవర్గానికి 5,500 ఇళ్లు** ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు విడతల్లో కలిపి 5,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. తొలి విడతలో 3,500, రెండో విడతలో 2,000 ఇళ్లు మంజూరు చేశామని చెప్పారు. మొదటి విడత పనులు చాలావరకు పూర్తయ్యాయని, నిర్మాణ పనుల పురోగతిని బట్టి దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. సొంత స్థలం ఉన్నవారికి ప్రాధాన్యత తనిస్తూ ఎల్-1 కేటగిరీలో సుమారు 2 వేల మందికి త్వరలో ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. **ఉపాధికి దగ్గరగా నివాసాలు** హైదరాబాద్‌లో స్థలాల కొరత ఉన్నప్పటికీ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు విలువైన ప్రభుత్వ భూములను వినియోగిస్తున్నామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ, పోలీసు శాఖలకు చెందిన భూముల్లోనూ ఇందిరమ్మ ఇండ్ల టవర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణానికి అనువైన భూములను సేకరిస్తున్నామని, వచ్చే బోనాల నాటికి లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసేలా పనులు వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు.

పాత ఓటర్లకు ఈసీ ఊరట

- జాబితాలో పేరు లేకున్నా ఫారం-6తో మళ్లీ నమోదు చేసుకోవచ్చు

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన పాత ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం ఊరటనిచ్చింది. గతంలో ఓటరుగా నమోదై ఉండి, ప్రస్తుతం జాబితాలో పేరు కనిపించని వారు తిరిగి ఓటు హక్కు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

గతంలో ఓటరుగా ఉన్నప్పటికీ మళ్లీ దరఖాస్తు చేయడం తప్పుడు ప్రకటన కిందకు రాదని తెలిపింది. ఫారం-6లోని 'మొదటిసారి ఓటు నమోదు' అనే ప్రకటనపై పాత ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ కారణంతో వారిపై ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద చర్యలు తీసుకోవద్దని ఎన్నికల నమోదు అధికారులకు సూచించింది. అయితే దరఖాస్తుదారులు



మరో పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికే ఓటరుగా నమోదై ఉండకూడదని స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టులో ఈ అంశంపై జరిగిన విచారణ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సూచనలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు పంపించింది. స్థానిక భాషల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించింది. దీంతో ముసాయిదా జాబితాలో పేర్లు లేని అర్హులైన పాత ఓటర్లు తిరిగి నమోదు చేసుకునేందుకు అవకాశం కలిగింది.

ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకులు సృష్టించిన కరువు!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, పాలకులు తెచ్చిన కరువని వ్యాఖ్యానించారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి మల్లావరుల సదాశివుడు స్మారక పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ పలువురు సాహితీవేత్తలను సత్కరించి పురస్కారాలు అందజేశారు. 2024-25 సంవత్సరానికి చెమన్‌సింగ్, 2025-26 సంవత్సరానికి సంగిశెట్టి శ్రీనివాస్‌కు స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో సేవలందించిన తిరునగరి దేవకిదేవి, కప్పంపల్లి స్వామిని సన్మానించారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణకు ఈ ఏడాది ఏడున్నర నెలల్లో గోదావరి నది ద్వారా 750 టీఎంసీలు, కృష్ణా నది ద్వారా 258 టీఎంసీల నీరు వచ్చిందని తెలిపారు. మొత్తం వెయ్యి టీఎంసీలకు పైగా నీరు అందుబాటులోకి వచ్చినప్పటికీ, వాటిని సమర్థంగా వినియోగించుకోలేకపోవడం బాధాకరమన్నారు. వందల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిపోతున్నా రాష్ట్రంలోని రైతులకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్‌పై అక్కసుతోనే గత ప్రభుత్వం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను పక్కనపెట్టడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. గోదావరి జలాలను తెలంగాణ పొలాలకు మళ్లించి రైతులకు సాగునీరు అందించడమే కవి మల్లావరుల సదాశివుడికి అందించే నిజమైన నివాళి అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోలేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ నెల 25న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10 వరకు ఓటరు నమోదు దరఖాస్తులపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు.

శాసనమండలి ప్రాంగణం అభివృద్ధికి కార్యాచరణ

తొలి అక్షరం/హైదరాబాద్,నవంబర్ 3 : రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో చేపట్టనున్న అభివృద్ధి, సుందరీకరణ పనుల ప్రతిపాదనలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పరిశీలించారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలాతో కలిసి ప్రాంగణాన్ని సందర్శించి ప్రతిపాదిత పనులపై అధికారులతో సమీక్షించారు. శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్, వైస్ చైర్మన్, డిప్యూటీ స్పీకర్లతోపాటు ఉభయ సభల కార్యదర్శుల నివాస భవనాల నిర్మాణ ప్రతిపాదనలపై వివరాలు తెలుసుకున్నారు. అనుబంధ భవనం, పరిపాలనా భవనం, శాసనసభా పక్ష కార్యాలయాలు, విశ్రాంతి భవనం, క్రీడా మైదానం, పార్కింగ్ సౌకర్యాల అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను పరిశీలించారు. **పచ్చదనానికి విఘాతం కలగొద్దు** శాసనసభ ప్రాంగణ విస్తరణ కోసం పర్యాటక శాఖకు చెందిన భూమితోపాటు డీజీపీ కార్యాలయానికి చెందిన కొంత భూమిని బదిలీ చేసే అంశంపై చర్చించారు. అభివృద్ధి పనుల సందర్భంగా పర్యావరణానికి హాని కలగకుండా, ఇప్పటికే ఉన్న పచ్చదనాన్ని పరిరక్షించాలని సంజయ్ జాజు అధికారులకు సూచించారు. పర్యావరణహిత, సుస్థిర అభివృద్ధి విధానాలతో ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిపారు.

కేసీఆర్ పాలనలో తెలంగాణ సంపద దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

తమ ప్రభుత్వం మాత్రం రైతులు పండించిన పంటకు బోనస్ అందించి అండగా నిలిచిందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే 74 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. **ప్రతి భూమికి భరోసా కల్పిస్తాం** రాష్ట్రంలో అర్హులైన పేదలకు 8 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు అందించామని మంత్రి తెలిపారు. సుమారు 120 ఏళ్ల క్రితం జరిగిన భూసర్వేల కారణంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భూసర్వే నిర్వహించాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు చెప్పారు. సర్వే అనంతరం మ్యాపులతో కూడిన భూధార్ అందించి భూయజమానులకు భరోసా కల్పిస్తామని తెలిపారు. విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పొంగులేటి పేర్కొన్నారు.

సైబర్ నేర ముఠాలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్, ఐ4సీ సీఈవో రాజేష్ కుమార్ పాల్గొన్నారు. **నేరం జరగకముందే అడ్డుకోవాలి** సైబర్ నేరాలు వ్యవస్థీకృత పరిశ్రమగా మారాయని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. నేరం జరిగిన తర్వాత డబ్బు తిరిగి రాబట్టడం కంటే, ముందుగానే మోసాలను అడ్డుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. నేరగాళ్లకు బాధితులను చేరుకునే మార్గాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాలు అందకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 202425లో దేశవ్యాప్తంగా సైబర్ నేరాల ఫిర్యాదులు 24 శాతం పెరగగా, తెలంగాణలో 3 శాతం తగ్గాయని తెలిపారు. రాష్ట్రంలో సైబర్ మోసాల వల్ల జరిగిన ఆర్థిక నష్టాలు 20 శాతం తగ్గినట్లు వెల్లడించారు. **బహుళ రాష్ట్రాల సమన్వయంతో దర్యాప్తు** సైబర్ నేరగాళ్లు రాష్ట్రాల సరిహద్దులు దాటి ఒకే నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నారని శిఖా గోయల్ తెలిపారు. నేరాల సూత్రధారులు, ఆర్థిక సహాయకులను గుర్తించేందుకు కేసుల వారీ దర్యాప్తు విధానానికి బదులుగా నిఘా ఆధారిత సమన్వయ దర్యాప్తు అవసరమని పేర్కొన్నారు. అనుమానాస్పద లావాదేవీలను నిలిపివేసేలా బ్యాంకులకు మార్గదర్శకాలు, ఏకీకృత దర్యాప్తు వేదిక, దేశవ్యాప్త ప్రత్యేక ఆపరేషన్లపై సమావేశంలో చర్చించారు. మహిళలు, చిన్నారులపై ఆన్‌లైన్ నేరాలు, కృత్రిమ మేధ వినియోగం, మ్యూల్ బ్యాంకు ఖాతాల ద్వారా జరిగే మోసాల నియంత్రణపైనా అధికారులు చర్చించారు. సమావేశంలో రూపొందించిన సిఫార్సులను అన్ని రాష్ట్రాలు, సంబంధిత సంస్థలకు పంపించి తదుపరి చర్యలు చేపట్టనున్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

విద్యార్థుల సమస్యలపై అధికారుల తక్షణ స్పందన

● నేలపట్ల ఎస్సీ, ఎస్టీ వసతి గృహాన్ని సందర్శించిన అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ. సుమంత్ ● విద్యార్థుల హక్కుల పరిరక్షణే మా లక్ష్యం: దబ్బటి శేఖర్ గౌడ్





తొలి అక్షరం/చౌటుప్పల్: అక్టోబర్ 3: చౌటుప్పల్ మండలంలోని నేలపట్ల ఎస్సీ, ఎస్టీ వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సామాజిక కార్యకర్త, సమాచార హక్కు రక్షణ చట్టం–2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దబ్బటి శేఖర్ గౌడ్ చేసిన ఫిర్యాదుపై అధికారులు స్పందించారు.అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ. సుమంత్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి సమస్యల వివరాలు సేకరించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, హాస్టల్ సిబ్బందితో కలిసి చర్చలు నిర్వహించారు.ఈ సందర్భంగా దబ్బటి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, సంక్షేమం, హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఫిర్యాదుపై వెంటనే స్పందించి హాస్టల్‌ను సందర్శించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

రాచకొండ ఎత్తిపోతల పథకంతోనే నారాయణపురం మండలానికి శాశ్వత సాగునీరు

75 కిలోమీటర్ల పాదయాత్రతో చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్న సీపీఐ(ఎం) శ్రేణులు

గ్రామగ్రామాన ప్రాజెక్టు ఆవశ్యకతపై చైతన్యం..

పాదయాత్ర బృందానికి ప్రజల ఘన స్వాగతం





తొలి అక్షరం/చౌటుప్పల్: నవంబర్ 3: రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి నారాయణపురం మండలానికి శాశ్వత సాగునీరు అందించాలనే డిమాండ్‌తో సీపీఐ(ఎం) నారాయణపురం మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల పాదయాత్ర మంగళవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంది. చెర్లగూడెంశివన్నగూడెం రిజర్వాయర్ నుంచి ప్రారంభమైన ఈ పాదయాత్ర 28 గ్రామాల మీదుగా సుమారు 75 కిలోమీటర్లు సాగింది.నారాయణపురం మండలంలో వేలాది ఎకరాల సాగుభూమి ఉన్నప్పటికీ, రైతులు వర్షాధార వ్యవసాయంపైనే ఆధారపడాల్సి వస్తోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చెరువులు, కుంటలకు శాశ్వత నీటి వసతి కల్పించడంతో పాటు రైతుల సాగునీటి, ప్రజల తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపాలంటే రాచకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా శివన్నగూడెం ప్రాజెక్టు పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రాజెక్టు సాధన కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు గ్రామగ్రామాన పర్యటించిన పాదయాత్ర బృందానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, కండువాలతో సత్కరించడంతో పాటు వాటర్ బాటిళ్లు, బిస్కెట్లు అందించి సంఘీభావం తెలిపారు. ప్రాజెక్టు పూర్తయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.ఈ పాదయాత్రలో మాజీ ఎమ్మెల్సీ, మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి. జంగారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, మాటూరి బాలరాజు, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, జిల్లా కమిటీ సభ్యులు, చౌటుప్ప ల్ మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, పట్టణ కార్యదర్శి గోశిక కరుణాకర్, సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, దోడ యాదిరెడ్డి, మల్లేపల్లి లలిత, దోనూరు నర్సిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు కన్నీటి కష్టం!





తొలి అక్షరం/ ఏన్కూర్ నవంబర్ 3: ఏన్కూరు మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో పత్తి 15,674 ఎకరాలు, మిర్చి 2,809 ఎకరాలు, వరి 3,836 ఎకరాల్లో సాగు చేశారు. వర్షం కారణంగా ముఖ్యంగా పత్తి, వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని గ్రామాల్లో వరి పంట నేలకొరగడంతో కోతలు కోయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.మిర్చి పంటలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వరి పంట నేలకొరిగినట్లయితే వర్షం తగ్గిన తర్వాత పంట పరిస్థితిని బట్టి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి ఏ. నరసింహారావు తెలిపారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

గొల్లపల్లిలో కాంగ్రెస్ నూతన కమిటీలు ఎంపిక

- యూత్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్, ఎన్ఎస్‌యూఐ కమిటీల ఏర్పాటు





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 3:నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలు, నెక్కొండ మండల కమిటీ సూచనల మేరకు దాసరి స్వామి ఆధ్వర్యంలో, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు బక్కి నరేష్ సమక్షంలో గొల్లపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీతో పాటు అనుబంధ సంఘాల కమిటీలను ఎన్నుకున్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వంగ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొమ్మెర యాలాద్రి, ఉపాధ్యక్షుడిగా కంటే రమేష్, ప్రధాన కార్యదర్శిగా బిర్రు ప్రభాకర్, కార్యదర్శిగా పసునూటి రామ్మూర్తి, కోశాధికారిగా కాడబోయిన శేఖర్ ఎంపికయ్యారు. గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అప్పం రాంప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెద్దకాసు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా బట్టు వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా భూక్య రాజశేఖర్, కార్యదర్శిగా చెవ్వ రంజిత్, కోశాధికారిగా దద్దు నరేష్ నియమితులయ్యారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా బట్టు దేవేందర్, ఉపాధ్యక్షుడిగా చల్ల లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా వేణువంక రామకృష్ణ, కార్యదర్శిగా బట్టు వీరన్న, కోశాధికారిగా మామిండ్ల సుధాకర్; ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా భూక్య లింగం, ఉపాధ్యక్షుడిగా భూక్య భీమన్న, ప్రధాన కార్యదర్శిగా భూక్య జంపన్న, కార్యదర్శిగా బానోత్ అనిల్, కోశాధికారిగా గుగులోత్ అశోక్ ఎంపికయ్యారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బిర్రు మధుకర్, ఉపాధ్యక్షుడిగా జిల్లా అశోక్, ప్రధాన కార్యదర్శిగా మాంకాల ప్రశాంత్, కార్యదర్శిగా మాంకాల అరుణ్; ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా అప్పం శివసాగర్, ఉపాధ్యక్షుడిగా బాధవత్ ప్రమోద్, ప్రధాన కార్యదర్శిగా చీపతి జశ్వంత్, కార్యదర్శిగా ముస్కు అరవింద్, కోశాధికారిగా బట్టు అరవింద్ నియమితుల య్యారు. అన్ని కమిటీలకు దాసరి స్వామిని గౌరవ అధ్యక్షుడిగా, కాడబోయిన రమేష్, బంగారు మల్లేష్, కంది నరసింహారెడ్డి, అప్పం శ్రీనివాస్, మారం నరసింహారెడ్డి, బట్టు రామచందర్, బట్టు శంకర్, ఎన్.రెడ్డి బుచ్చిరెడ్డి, బిర్రు పీరస్వామి, మాదారపు మహేందర్‌లను గౌరవ సలహాదారులుగా నియమించారు. నూతన అధ్యక్షులు వంగ రాజు, అప్పం రాంప్రసాద్ మాట్లాడుతూ తమ ఎన్నికకు సహకరించిన టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మం డల అధ్యక్షుడు లావుడ్య తిరుమల్‌తో పాటు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు చేయూత

● బ్లైండ్ స్కూల్, దివ్యాంగుల కేంద్రానికి నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ





తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 3:నెక్కొండ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కర్ణకంటి రాజేష్ తన పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వరంగల్ ఆదర్శ బ్లైండ్ స్కూల్ విద్యార్థులకు భోజనం, నిత్యావసర సరుకులు అందజేశారు. హన్మకొండలోని స్పందన దివ్యాంగుల, బధిరుల కేంద్రంలోని చిన్నారులకు పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు.గత 12 ఏళ్లుగా నెక్కొండ తహసీల్దార్ కార్యాలయంలో సేవలందిస్తున్న రాజేష్.. కలెక్టర్ డాక్టర్ సత్యశారద చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి పురస్కారం అందుకున్నారు. పుట్టినరోజును సేవా కార్యక్రమాలతో జరుపుకోవడంపై పలువురు అభినందించారు.

పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు



- అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇల్లు అందిస్తాం.. రెండో విడతలో 187 మందికి మంజూరు పత్రాల పంపిణీ: మంత్రి పొంగులేటి





తొలి అక్షరం/తిరుమలాయపాలెం, నవంబర్ 3:పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామంలోని శ్రీ సాయి గణేష్ ఫంక్షన్ హాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో రెండో విడత కింద 187 మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుపేదలందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా రూ.5 లక్షల ఆర్థిక సాయంతో ఇళ్లు నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. మొదటి విడతలో 810 ఇళ్లు మంజూరు చేయగా, దాదాపు 700 ఇళ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరే వరకు ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ, సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి పథకాలను అమలు చేసినట్లు మంత్రి తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు 74 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 14 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ మొదటి విడతలో మంజూరైన ఇళ్లలో 600 ఇళ్లు పూర్తయ్యాయని, మరో 100 ఇళ్లు నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెండో విడతలో అదనంగా 185 ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణ దశలను బట్టి ఫొటోలు సమర్పిస్తే నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.అనంతరం ఏలువారిగూడెం గ్రామంలో ఎన్.నగేష్‌మంగమ్మ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని మంత్రి ప్రారంభించి గృహప్రవేశం చేయించారు. తెట్టెంపాడుబీరోలు రోడ్డు నుంచి ఏలువారిగూడెం వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి, బీరోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.48 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ

- సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 3:రామన్నపేట మండలం కుంకుడుపాముల గ్రామంలో పశుసంపద సంరక్షణలో భాగంగా దూడలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ గొలుసుల సత్తయ్య యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి దోమల ముత్తయ్య పాల్గొని దూడలకు మందులు వేశారు. నట్టల నివారణ మందుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బొక్క శ్రీనివాస్‌రెడ్డి, వలిగొండ పరశురాములు, రైతులు పాల్గొన్నారు.

చిన్నారిని ఆశీర్వదించిన కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నిర్మల



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 3:

రామన్నపేట మండలం నీర్నంల గ్రామానికి చెందినముత్యాల భాగ్యలక్ష్మి రమేష్ దంపతుల కూతురి డోలారోహణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు ముత్యాల కిషన్ పెరుమాండ్ల నవీన్ నాయకులు చల్ల సత్య ప్రకాష్ కట్ట కుమార్ సామాజిక కార్యకర్త నోముల యాదగిరి మస్క్ బాబు రాకేష్ శివ పాల్గొన్నారు

లింగాల జీవస్తికి జన్మదిన శుభాకాంక్షలు

- తాతయ్య రామ్మూర్తి గౌడ్



తొలి అక్షరం/ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 3: ఖమ్మం జిల్లా ప్రతినిధి, లింగాల రామ్మూర్తి గౌడ్, మనవరాలు మా ఇంటి మహాలక్ష్మి మా బుజ్జి మనవరాలుకి జన్మదిన శుభాకాంక్షలు , నువ్వు ఎప్పుడు ఇలాగే నవ్వుతూ ఆనందంగా ఉండాలి మా జీవితాల్లో వెలుగు నింపిన మా చిట్టి తల్లికి పుట్టినరోజు శు భాకాంక్షలు దేవుడు నిన్ను చల్లగా చూడాలి నానమ్మల ప్రాణం తాతయ్యల బంగారం అయినా మా మనవరాలుకి హ్యాపీ బర్త్ డే నువ్వు చదువులోనూ జీవితంలోనూ ఉన్నత శిఖరాలను అదిరోహించాలని, కోరుకుంటున్నాను మా వంశానికి కీర్తి తెచ్చే గుణవంతురాలివి కావాలని, తాతయ్యల నానమ్మలల ,దీవెనలు నీకు ఎప్పుడు ఉంటాయి కాలం మరెన్నో విజయాలు సాధిస్తూ మాకు గర్వంగా నిలవాలి హ్యాపీ బర్త్డే బంగారు తల్లి

కాచం సత్యనారాయణకు అండగా సర్పంచుల ఫోరం... తండ్రి మృతికి కన్నీటి నివాళి



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 3:తెలంగాణ ఉద్యమకారుడు, విశ్వాంభర పత్రిక అధినేత కాచం సత్యనారాయణ తండ్రి కాచం బిక్షమయ్య ఇటీవల మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న సర్పంచుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గర్దాసు విక్రమ్, సోమవారం కాచం సత్యనారాయణ నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించారు .అనంతరం దివంగత కాచం బిక్షమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ "బిక్షమయ్య గ్రామ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ఆయన మృతి సర్పంచులకు తీరని లోటు" అని అన్నారు.కాచం కుటుంబానికి అన్ని వేళలా సర్పంచుల ఫోరం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కాచం సత్యనారాయణ చేసిన కృషిని, సమాజ సేవలో ఆయన చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో అరువూరు గ్రామ సర్పంచ్ సుక్క ముత్యాలు, సర్పంచుల ఫోరం యాదాద్రి జిల్లా నాయకులు, స్థానిక నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి: ఎడిఇ కె.శ్రీకాంత్



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 3: విద్యుత్ వినియోగదారులకు సమస్యలు లేకుండా మెరుగైన సేవలు అందించ డానికి కృషి చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏడీఈ. కె.శ్రీ కాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వ్యవసాయ బావులవద్ద విద్యుత్ విని యోగ సామర్థ్యం పెంపు కోసం ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన పంపు సెట్లు,కెపాసిటర్లను వాడాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని, విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ఏఈలు యం కోటేశ్వర్‌రావు, జె.నరసింహ, ఏఏవో డి. మోతీరాం, సిబ్బంది యం నటరాజ్, కే.శ్రీనివాస్ రెడ్డి, కే . శ్రీనివాస్, కె.స్వాతి, ఎండి అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ మృతి బాధాకరం

- కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, భార్యకు ఉద్యోగం కల్పించాలి: మంద వేణుగోపాల్ రెడ్డి



తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 3:తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన వేముల లక్ష్మణ్ గౌడ్ (40) ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడటం విచారకరమని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో చేసిన అప్పులకు తోడు పంట నష్టాలు, రుణదాతల ఒత్తిడితో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమకారుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన వేముల



తొలి అక్షరం/రామన్నపేట నవంబర్ 3:రామన్నపేట మండలం, బోగారం లో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి సింగల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న జగన్మోహన్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కందిమల్ల గోపాల్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల రాజిరెడ్డి గుత్తా నర్సిరెడ్డి శంబాల వెంకన్న బోగారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గోగు హరిప్రసాద్ యాదవ్ , బోగారం మాజీ సర్పంచ్ గంపల రామచంద్రారెడ్డి మాజీ ఎంపిటిసి గోగు పద్మ సత్తయ్య యాదవ్ , వార్డు సభ్యులు కనుక మల్లేష్ గోగు సురేష్ యాదవ్ చిరగొని శిల్ప నవీన్ యాదవ్ మండల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కందగట్ల రాహుల్ యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు చిరగోని నవీన్ యాదవ్ గుంతకండ్ల గోవర్ధన్ రెడ్డి మేడి నరసింహ మాజీ రైతు సంఘం అధ్యక్షులు చెల్లమల్ల నర్సిరెడ్డి మారం గోపాల్ రెడ్డి జెల్ల దత్తాత్రేయ రైతులు కట్ట సత్తిరెడ్డి మెట్టు అంజయ్య కట్ట పద్మా రెడ్డి బై కానీ గోపాల్ కట్ట దశరథ రెడ్డి గుంత కండ్ల నవీన్ రెడ్డి కొండం శ్రీనివాస్ రెడ్డి అవనగంటి ధనంజయ బత్తుల కుమార గుంజే చంద్రం గోగు మహేష్ చిరబోయిన సాయి బొడ్డుపెళ్లి నాని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపునకు కాంగ్రెస్ ప్రచారం

● పట్టభద్రుల ఓటరు నమోదుకు ప్రత్యేక చర్యలు



తొలి అక్షరం/హనుమకొండ ప్రతినిధి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి గెలుపు కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశాల మేరకు నీరుకుల్ల 95వ బూత్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను గుర్తించి ఆన్‌లైన్‌లో ఓటరు నమోదుకు సహకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్షం కుమారస్వామి, బీఎల్ఏ పొనుగోటి శ్రీనివాస్, క్లస్టర్-1 ఇన్‌చార్జి పొనుగోటి సత్యనారాయణ, సర్పంచ్ అభ్యర్థి నీలం రాజు, మండల యూత్ జనరల్ సెక్రటరీ పిట్టల రాజకుమార్, దురిశెట్టి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ఓటు హక్కే బలమైన ఆయుధం

● అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలి

● డాక్టర్ సూర్కంటి శ్రీధర్ రెడ్డి మందోళ్లగూడెం గ్రామ ఉపసర్పంచ్



తొలి అక్షరం/చౌటుప్పల్. నవంబర్ 3: వరంగల్‌ఖమ్మం నల్గొండ:పట్టభద్రుల హక్కుల పరిరక్షణకు, వారి సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించడానికి ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును వినియోగించు కోవాలని సూర్కంటి శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు.వరంగల్ ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా సూర్కంటి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగ యువత ఇబ్బందులు, విద్యావంతుల హక్కులు, సమాజ అభివృద్ధి వంటి అంశాలపై శాసనమండలిలో సమర్థవంతంగా గొంతు వినిపించాలంటే పట్టభద్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది కేవలం ఎన్నికల ప్రక్రియలో భాగం మాత్రమే కాదని, సమాజ భవిష్యత్తును నిర్ణయించే ప్రజాస్వామ్య ఆయుధమని అన్నారు.అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా నవంబర్ 6, 2026వ తేదీలోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఒక్క ఓటు ఒకరి భవిష్యత్తును మాత్రమే కాదు.. సమాజ భవిష్యత్తును కూడా మార్చగలదు. పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని సూర్కంటి శ్రీధర్ రెడ్డి కోరారు.

సీనియర్ పాత్రికేయుడు గిరగాని శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు

- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీపీ ఘటిక అజయ్‌కుమార్



తొలి అక్షరం/నెక్కొండ, నవంబర్ 3: నెక్కొండకు చెందిన సీనియర్ ఆంధ్రజ్యోతి పాత్రికేయుడు గిరగాని శ్రీనివాస్ 56వ జన్మదినం సందర్భంగా తెలంగాణ పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఘటిక అజయ్‌కుమార్ కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దోనికెన సారంగపాణి, మాజీ సర్పంచులు బొల్లెబోయిన వీరస్వామి, వడ్డే సురేష్, టీఎస్ఎంఆర్‌పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య, బీఆర్ఎస్ నాయకులు దాసరి శ్రీనివాస్, మూసిన మాధవ్, మాజీ రామాలయ కమిటీ చైర్మన్ గన్ను కృష్ణ, పాత్రికేయులు డెక్క సాయికుమార్, గోపగాని శ్రీకాంత్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారులు, మిత్రులు పాల్గొని శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నల్లగొండ రైతు బహిరంగ సభకు తరలిరావాలి

- సీపీఎం నాయకులు జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం పిలుపు





తొలి అక్షరం/రామన్నపేట, నవంబర్ 3: నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించే అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా జరిగే రైతు బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇస్కిళ్ల, దుబ్బాక గ్రామాల్లో రైతులతో కలిసి ప్రచారం నిర్వహించారు. రైతుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని వారు కోరారు. ప్రతి గ్రామం నుంచి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి గన్నేబోయిన విజయభాస్కర్, సర్పంచ్ గట్టు నర్సింహా, మేడి గణేష్, మేడబోయిన శ్రీనివాస్, వల్లమళ్ల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్



తొలిఅక్షరం/నెల్లికుదురు నవంబర్ 03: నెల్లికుదురు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సీఆర్. నంబర్.116/2026 యూ/సెక్ 8(సి) ఆర్/డబ్లు 20(బి)(అఅ)(బి) శీట ఎన్ డి పి ఎస్.యాక్ట్ 1985 కేసులో గతంలో పోలీసుల తనిఖీల సమయంలో తప్పించుకొని పరారీలో ఉన్న నిందితుడు కాపుగేరీ రాజు ఏ ఎఫ్.జడ్, తండ్రి: పెద్ద మల్లయ్య (లేట్),వయస్సు: 29 సంవత్సరాలు, నివాసం: హనుమాన్ పుర, మహబూబ్‌నగర్ పట్టణం, జిల్లా అను వ్యక్తిని నిన్న పోలీసు అధికారులు పట్టుకొని అదుపులోకి తీసుకొని అరెస్టు చేయడం జరిగింది.విచారణలో నిందితుడు తన సహచరులతో కలిసి భద్రాచలం ప్రాంతం నుండి సుమారు 2.400 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయించాలనే ఉద్దేశంతో తీసుకువెళ్తున్నట్లు చెప్పడం జరిగింది. ఈ కేసుకు సంబంధించి నిందితుడి వద్ద నుండి ఒక ఆపిల్ కంపెనీ మొబైల్ ఫోన్‌ను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగుతున్నది.గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి. అని మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి, అని, కేసముద్రం సి.ఐ.సత్యనారాయణ, నెల్లికుదురు ఎస్సై కరుణాకర్ చెప్పడం జరిగింది.

షాద్‌నగర్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై మందకృష్ణ ఆగ్రహం

రాధ, శిశువు మృతికి బాధ్యులైన సిబ్బందిని సస్పెండ్ చేయాలి

ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలి



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 03: షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి వైద్య సేవల తీరును పరిశీలించారు. ఇటీవల కొందుర్గు మండలం చెరుకుపల్లికి చెందిన గర్భిణి రాధ ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చి తల్లీబిడ్డ మృతి చెందిన ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందిని కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతోనూ మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు.ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ రాధ, ఆమె గర్భంలోని శిశువును కాపాడలేకపోవడం బాధాకరమన్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరోపించారు. ఆసుపత్రిలో ప్రస్తుతం కేవలం 14 మంది వైద్యులు మాత్రమే ఉండటం ఆందోళనకరమని, కనీసం 30 మంది వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వైద్యులు, సిబ్బందిని సస్పెండ్ చేయాలని, సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. పేదలకు మెరుగైన వైద్యం అందేలా పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది, అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రంగారెడ్డి జిల్లా నాయకులు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతే ముఖ్యం

•టపాసుల దుకాణాల మధ్య 3 మీటర్ల దూరం ఉండాలి: కలెక్టర్ దివాకర టీఎస్



తొలి అక్షరం/ఖమ్మం, నవంబర్ 3: దీపావళి వేడుకల్లో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులు, టపాసుల విక్రయదారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ దుకాణాల కేటాయింపును పారదర్శకంగా లాటరీ పద్ధతిలో చేపట్టాలని సూచించారు. ప్రతి దుకాణం మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండాలని, విద్యుత్ వైరింగ్‌ను తనిఖీ చేసి ధ్రువీకరించాలని తెలిపారు. అగ్నిమాపక వాహనాలు, 108 సేవలు, అత్యవసర వైద్య చికిత్సలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వ్యాపార లాభాల కంటే ప్రజల భద్రతే ముఖ్యమని, గ్రీన్ క్రాకర్స్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం నగరంలో టపాసుల దుకాణాల కోసం 224 దరఖాస్తులు వచ్చినట్లు పోలీస్ శాఖ ఏసీపీ వెల్లడించారు.

31వ డివిజన్‌లో పట్టభద్రుల ఓటరు నమోదుకు విస్తృత పర్యటన...

•కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు

తెలిపిన జగన్మోహన్ రెడ్డి...

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: 31వ డివిజన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగన్మోహన్ రెడ్డి హాజరై,తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజుతో కలిసి డివిజన్‌లో పర్యటిస్తూ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆదేశాల మేరకు 31వ డివిజన్‌లోని అర్హులైన ప్రతి పట్టభద్రుని ఇంటింటికీ వెళ్లి నూతన ఓటరు నమోదుకు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు కృషి చేస్తున్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేస్తున్న కృషిని అభినందించిన జగన్మోహన్ రెడ్డి,ప్రతి అర్హులైన పట్టభద్రునికి ఓటు హక్కు కల్పించే దిశగా చేపడుతున్న కార్యక్రమాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో 31వ డివిజన్ ఇన్‌చార్జ్ మార్క విజయ్ కుమార్,డివిజన్ అధ్యక్షులు సత్తు రమేష్,మాజీ డివిజన్ అధ్యక్షులు వంకేశ్వర్ సురేందర్,ముప్ప వేణు,డిసిసి కార్య వర్గ సభ్యులు మామిండ్ల సురేష్‌పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.పట్టభద్రుల ప్రతి ఓటు కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి బాటలు వేయాలి అనే లక్ష్యంతో 31వ డివిజన్ కాంగ్రెస్ శ్రేణులు సమిష్టిగా ముందుకు సాగుతున్నాయి.



భద్రకాళి అమ్మవారికి చాగంటి కోటేశ్వరరావు ప్రత్యేక పూజలు

తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు వరంగల్‌లోని చరిత్ర ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని సందర్శించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు పూర్ణకుంభం, వేదస్వస్తితో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ముందుగా గోకులంలో గోప్రదక్షిణ చేసి, శ్రీ వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. భక్తులను ఉద్దేశించి చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం చేయడంతో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

బిజెపి ఎస్టి మోర్చ మండల ప్రధాన కార్యదర్శులగా నవీన్, మహేందర్

- నియమించిన బిజెపి మండల అధ్యక్షుడు చందురాజ్ యాదవ్, బిజెపి మోర్చ ఉపాధ్యక్షులు సుందర్ నాయక్,మండల ఎస్టి మోర్చా అధ్యక్షులు జోహార్ లాల్



తొలి అక్షరం/నెల్లికుదురు నవంబర్ 03:నెల్లికుదురు మండలం స్థానిక కేంద్రంలో ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శులను బిజెపి మండల అధ్యక్షుడు చందు రాజ్ యాదవ్ మరియు బిజెపి జిల్లా ఎస్టి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు సుందర్ నాయక్, ఎస్సీ మోర్చ నాయకులు గద్దల ఐలయ్య పాల్గొని, ఎస్టి మండల మోర్చా అధ్యక్షులు జవహర్ లాల్, మండల మోర్చా ప్రధాన కార్యదర్శిలను నియమించడం జరిగింది. ప్రధాన కార్యదర్శిగా బానోత్ నవీన్, మరియు గుగులోత్ మహేందర్ ని నీ యమించడం జరిగింది. ప్రధాన కార్యదర్శులు, బానోతు నవీన్, గూగుల్ మహేందర్ మాట్లాడుతూ బిజెపి మండల మోర్చా కార్యదర్శులుగా మమ్మల్ని నియమించినందుకు బిజెపి మండల అధ్యక్షుడు చందు రాజు యాదవ్, బిజెపి జిల్లా మోర్చ ఉపాధ్యక్షులు సుందర్ నాయక్, బిజెపి మండల ఎస్టి మోర్చా అధ్యక్షులు జోహార్ లాల్ మరియు ఎస్సీ మోర్చా గద్దల ఐలయ్యకి కృతజ్ఞతలు చెప్పడం జరిగింది. పార్టీ బలోపేతానికి ముందుండి నడిపిస్తామని మోర్చప్రధాన కార్యదర్శులు చెప్పడం జరిగింది.ం

న్యాయవాదులను ఓటు నమోదు చేసుకోవాలని కోరిన ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డి

•కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని గుర్తించి మద్దతు

ఇవ్వాలి: ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజు



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: హన్మకొండవరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్‌రెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి న్యాయవాదులను కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని, తనకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా హన్మకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల పాలనతో పోలిస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కనిపిస్తే తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి అభివృద్ధికి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, కూడాచైర్మన్ గుండు సుధారాణి, అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. న్యాయవాదులందరూ ఓటు నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, లీగల్ సెల్ నాయకులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

చటాన్‌పల్లి ఆర్వోబీ పనులకు త్వరలో మోక్షం!

- 50 రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం: బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి



తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 03: షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు మరో 50 రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని బీజేపీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల్లో 20ఏ భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు రైల్వే అధికారులు హామీ ఇచ్చారని వెల్లడించారు. ఎంపీ డీకే అరుణ చొరవతో అధికారులు స్పందించారని పేర్కొన్నారు. నవంబర్ 3న రెవెన్యూ అధికారులు సిద్ధం చేసిన సర్వే నివేదికను రైల్వే అధికారులు స్వీకరించారని తెలిపారు. అనంతరం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తారన్నారు. గత మూడేళ్లుగా పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జాప్యానికి కారణాలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎంపీ డీకే అరుణ, కేంద్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ కిషన్‌నగర్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

- అధ్యక్ష కార్యదర్శులుగా కార్తీక్, రవీంద్ర చారి



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 03: ఎస్ఎఫ్ఐ కిషన్‌నగర్ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కార్తీక్, కార్యదర్శిగా రవీంద్ర చారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. నూతన కమిటీ సభ్యులకు విప్లవాభినందనలు తెలిపారు. స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం అనే ఆశయాలతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. గ్రామగ్రామాన ఎస్ఎఫ్ఐ సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. 1970లో ఏర్పాటైన ఎస్ఎఫ్ఐ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వంటి మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ సమసమాజ నిర్మాణం కోసం పనిచేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల హక్కుల సాధనలో నూతన కమిటీ ముందుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా వంశీ, లోకేష్, సహాయ కార్యదర్శులుగా రాజేష్, అభిలాష్‌తో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు అఖిల్, అవినాష్, సజీవ్, రాకేష్, వివేకానంద పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్ల ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- కనీస వేతనం రూ.42 వేలు చెల్లించాలి.. బొట్ల చక్రపాణి డిమాండ్



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ హన్మకొండ జిల్లా కన్వీనర్ బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. హన్మకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఎస్. రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన బీసీ హాస్టల్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నిర్ణీత పనిగంటలు, ఉద్యోగ భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో వేతనాల్లో కోతలు విధించడం సరికాదని, ఇటీవల విధుల్లో చేరిన వారికి తక్కువ వేతనాలు చెల్లిస్తున్న విధానాన్ని సరిచేయాలని కోరారు.ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేసి పర్మినెంట్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని ప్రకటించి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు కనీస వేతనంగా రూ.42 వేలు చెల్లించాలని కోరారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కుక్‌లు, హెల్పర్లు, స్వీపర్లు, వాచ్‌మెన్‌లను నియమించి, కార్మికులకు పూర్తి వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎం.డి. రహీం, అనిల్‌రాజు, రవీందర్, హరికృష్ణ, శోభ, పద్మ, పరమేశ్వరి, తిరుమల, సుభద్ర, నాని తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల సమస్యలపై కేంద్రం నిర్లక్ష్యం వీడాలి

- ఎంఎస్‌పీ కంటే మార్కెట్ ధర ఎక్కువగా ఉంటే సీసీఐ కమర్షియల్ కొనుగోళ్లు చేపట్టాలి: తెలంగాణ రైతు సంఘం



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి: రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీసీఐ వరంగల్ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ అనుకూల వాతావరణం లేక దిగుబడులు తగ్గడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో ప్రైవేటు వ్యాపారులు కొందరి పత్తికి మాత్రమే అధిక ధర చెల్లిస్తూ, మిగతా రైతుల నుంచి క్వింటాకు రూ.200 నుంచి రూ.1,000 వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.పత్తికి క్వింటాకు రూ.12 వేల ధర కల్పించాలని, నాణ్యత, తేమ శాతం పేరుతో ధర తగ్గిస్తున్నారనే ఫిర్యాదులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పీ కంటే మార్కెట్ ధర ఎక్కువగా ఉన్నప్పుడు సీసీఐ కమర్షియల్ పద్ధతిలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్లలో పారదర్శకమైన వేలం విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఉపాధ్యక్షుడు ఊరటి హంసాల్‌రెడ్డి, కోశాధికారి సిరుల రవీందర్, కత్తి సుధాకర్, బొల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓంకార్ సాహితి విద్యాలయంలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

- విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాల పెంపునకు వినూత్న కార్యక్రమం





తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 03: షాద్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో గల ఓంకార్ సాహితి విద్యాలయంలో ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.కె. రాజన్, ప్రిన్సిపల్ అజిత రాజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను స్వయంగా తయారుచేసి ప్రదర్శించడంతో పాటు తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు విక్రయించారు. వంటకాల తయారీ, ధరల నిర్ణయం, విక్రయాలు, డబ్బుల నిర్వహణ వంటి అంశాలను ఆచరణాత్మకంగా తెలుసుకున్నారు. విద్యార్థులు తయారుచేసిన ఆహార పదార్థాలను ఒకరికొకరు పంచుకుంటూ ఉత్సాహంగా గడిపారు.పుస్తక జ్ఞానంతో పాటు జీవితానికి అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, వ్యాపార దృక్పథం పెరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, సీహెచ్. సింధు, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రకళ కుటుంబానికి విశారదన్ మహారాజ్ పరామర్శ

- దళిత బిడ్డ చంద్రకళకు ఘన నివాళి



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 03: షాద్‌నగర్ పట్టణానికి చెందిన న్యాయశాస్త్ర విద్యార్థిని డాకూరి చంద్రకళ మృతి పట్ల ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం చంద్రకళ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె తల్లిదండ్రులు చిన్నయ్య, లక్ష్మమ్మను వారి నివాసంలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉన్నత చదువులు అభ్యసిస్తూ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న దళిత బిడ్డ చంద్రకళ అకాల మరణం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే కుటుంబానికి తీరని లోటు ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, కష్టకాలంలో మనోధైర్యంతో ఉండాలని సూచించారు. చంద్రకళ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

చంద్రకళ కుటుంబాన్ని పరామర్శించిన మందకృష్ణ మాదిగ

- అకాల మరణం సమాజానికి తీరని లోటు



తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 03: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన న్యాయశాస్త్ర విద్యార్థిని డాకూరి చంద్రకళ మృతిపట్ల ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం చంద్రకళ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పెంటనుల నరసింహ మాదిగ ఆధ్వర్యంలో చంద్రకళ తల్లిదండ్రులు చిన్నయ్య, లక్ష్మమ్మ నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. చదువుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఎన్నో ఆశలు పెట్టుకున్న చంద్రకళ అకాల మరణం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. కుటుంబానికి ఎదురైన విషాదం బాధాకరమని పేర్కొన్నారు. చంద్రకళ మృతి ఆ కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

సిద్దాపూర్ డంపింగ్ యార్డుపై కాంగ్రెస్ మౌనం ఎందుకు?

126 రోజులుగా ప్రజల పోరాటం..
32 రోజులుగా రిలే నిరాహార దీక్షలు
జవహర్‌నగర్‌కు ఒక న్యాయం..
సిద్దాపూర్‌కు మరో న్యాయమా?





తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 03: రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో ప్రతిపాదించిన డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ప్రజల ఆందోళన కొనసాగుతోంది. 86 ఎకరాల ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దంటూ 126 రోజులుగా ప్రజలు పోరాడుతున్నారు. అక్టోబర్ 4 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టగా, 32 రోజులుగా కొనసాగుతున్నాయని జేఏసీ నాయకులు తెలిపారు.డంపింగ్ యార్డు రానివ్వబోమని హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడు ఉద్యమానికి ప్రత్యక్ష మద్దతు ఎందుకు తెలపడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. జీవో 641 ద్వారా భూమి కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై అఖిలపక్ష సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు ఆదేశించిన నేపథ్యంలో సిద్దాపూర్ విషయంలోనూ స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి జేఏసీ లేఖలు పంపినట్లు వెల్లడించింది. ప్రజాప్రతినిధులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఉద్యమకారులు కోరుతున్నారు.



చంద్రకళ కుటుంబానికి అండగా ఉంటాం

● రూ.25 వేల ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● యువత ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలి

తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 03: డాకూరి చంద్రకళ మృతి తీవ్ర విషాదాన్ని కలిగించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం షాద్‌నగర్‌లోని ఆమె నివాసానికి వెళ్లి తల్లిదండ్రులు లక్ష్మమ్మ, చిన్నయ్యలను పరామర్శించారు. చంద్రకళ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున అందాల్సిన సహాయాన్ని త్వరగా అందించేందుకు కృషి చేస్తానని, కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవద్దని, జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. చదువుతో ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్, జంగారి రవి, ఆగిర్యాల కృష్ణారెడ్డి, రఘునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్ల పరిశీలన

- ఐదు ప్రమాదకర ప్రాంతాల్లో అధికారుల తనిఖీలు



తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 3: షాద్‌నగర్ నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా, పోలీసు, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల అధికారులు సంయుక్తంగా ఐదు బ్లాక్‌స్పాట్లను పరిశీలించారు. కొత్తూరులో మూడు, నందిగామ, చేజర్లలో ఒక్కొక్కటి చొప్పున తనిఖీలు నిర్వహించి ప్రమాదాలకు కారణాలను గుర్తించారు. అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ హెల్మెట్, సీటుబెల్టు ధరించాలని సూచించారు.

గ్రామదేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లపుడు ఉండాలి

ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి

కోడిచర్ల మైసమ్మ గుడిలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రత్యేక పూజలు

పెంజర్ల ఉపసర్పంచ్ శాంతన్ రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 03: రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం కోడిచర్ల గ్రామంలోని ప్రసిద్ధ మైసమ్మ దేవాలయం వద్ద పెంజర్ల ఉపసర్పంచ్ శాంతన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మైసమ్మ అమ్మవారికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...గ్రామదేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని,ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజలలో ఆధ్యాత్మిక భావనను పెంపొందిస్తాయని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో పెంజర్ల ఉపసర్పంచ్ శాంతన్ రెడ్డి,గ్రామ వార్డు సభ్యులు మామిడి భారతమ్మ,కాటం రమాదేవి, కంటికి మై బుజ్జి,కమ్మరి వేదంతా,చారి,షేక్ అర్బన్,మంద మాధవి,రాముట్ల రాములు,ఆకన్పల్లి మాధవి, మరియు దేశాల శారద,కోడిచర్ల ఉపసర్పంచ్ రాందాస్, నాయకులు బైగరి రాజు, జైపాల్,వనం జంగయ్య, పోచన్న,మంద శ్రీను,గోపాల్ నాయక్, మల్లేష్ యాదవ్,బిచ్యా నాయక్,సిద్దాపూర్ రమేష్, నరేందర్,రెడ్యా నాయక్,శివ చారి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రవీందర్ యాదవ్ పరామర్శ





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 03: కేశంపేట మండలం నిర్దవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పాష తండ్రి ఖయుమోద్దీన్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ వారి నివాసానికి చేరుకుని ఖయుమోద్దీన్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సురేందర్, మాజీ సర్పంచులు శ్రీశైలం, వెంకట్‌రెడ్డి, నాయకులు జగత్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, జాంగాచారి, సిలివేరు మల్లయ్య, నిరంజన్, వెంకటేష్, జంగయ్య, చందు, రమేష్, ఫైజాన్ ఖాన్, రమేష్ నాయక్, యూసుఫ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

పేదల భూములపై పరిశ్రమల కన్ను!

- రాపోలు భూములను ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించవద్దు.. సీఎం రేవంత్‌రెడ్డికి బక్కని నర్సింహులు బహిరంగ లేఖ





తొలి అక్షరం/షాద్‌నగర్, నవంబర్ 3:వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోలు గ్రామంలోని పేదల భూములను ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించడంపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం బహిరంగ లేఖ రాశారు.గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 227, 269, 237లో ఉన్న 500 ఎకరాలకు పైగా భూములను పరిశ్రమలకు కేటాయించే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని కోరారు. గతంలో నిరుపేదలకు పంపిణీ చేసిన భూములను పరిశ్రమల పేరుతో తీసుకుంటే వారి జీవనాధారం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు.పరిశ్రమల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, సాగుకు అనుకూలమైన భూములను వదిలి గుట్టలు, బీడు భూములను కేటాయించాలని సూచించారు. రైతులు, పేద కుటుంబాల ప్రయోజనాలను కాపాడాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

విద్యావేత్తలతో ఎమ్మెల్యే నాగరాజు ఆత్మీయ సమ్మేళనం

- ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క.. పాల్గొన్న ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డి



తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, కళాశాలల అధ్యాపకులతో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా, ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించి వారి హక్కుల కోసం కృషి చేసే నాయకత్వం అవసరమన్నారు. విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, గంద్ర సత్యనారాయణరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కూడ చైర్మన్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మోహిని భస్మాసుర నాటకానికి ప్రేక్షకుల ప్రశంసలు





- పౌరాణిక కళావైభవం.. మోహిని భస్మాసుర ప్రదర్శనకు విశేష స్పందన

తొలి అక్షరం/షాద్ నగర్,నవంబర్ 03: శ్రీనివాస సిరి నాట్య కళామండలి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో అక్టోబర్ 30న 'మోహిని భస్మాసుర' పౌరాణిక పద్య నాటకాన్ని ఘనంగా ప్రదర్శించారు. కళామండలి వార్షికోత్సవం, దసరా బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముద్దెన పంచనాదం రచించిన ఈ నాటకానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది.కార్యక్రమానికి పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, యేన్ యాదిరెడ్డి, కళ్లెం మురళీధర్‌రెడ్డి, వరికుప్పల నరసింహ, మల్లాది వెంకటరమణ, కోరుకొండ ప్రసాదరాయి శర్మ, వడ్ల రమేష్‌చారి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. పౌరాణిక నాటకాల ప్రాధాన్యతను అతిథులు వివరించారు. ఈ కళారూపం అభివృద్ధికి సిరిగిరి రామాచారి చేస్తున్న కృషిని అభినందించారు. నాటకంలో విష్ణుమూర్తిగా సిరిగిరి రామాచారి, నారదుడిగా సంపంగి కృష్ణ, భస్మాసురుడిగా పి. మోహాపారావు, శంకరుడిగా జి. అంజయ్యగౌడ్, మోహినిగా సురభి జ్యోతి, లక్ష్మిగా సురభి ప్రియాంక తమ నటనతో ఆకట్టుకున్నారు. వి. మాధవరాజు పద్యాలకు స్వరాలు సమకూర్చగా, బ్రహ్మం తబలా, కీబోర్డు వాయిద్యాలతో సంగీతాన్ని అందించారు. కళాకారుల ప్రతిభను ప్రేక్షకులు అభినందించారు.

బియ్యం ధరలపై నిఘా.. దుకాణాల ఎదుట ధరల బోర్డులు

● నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలి.. అధికంగా వసూలు చేస్తే 1915 ఫిర్యాదు చేయండి ● కన్జ్యూమర్ కమిషన్ మీడియేటర్ టీ. గోపాల్ నారాయణ వెల్లడి





తొలి అక్షరం/షాద్ నగర్, నవంబర్ 03: రంగారెడ్డి జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు షాద్‌నగర్ మార్కెట్‌లో బియ్యం ధరలను నిర్ణయించినట్లు కన్జ్యూమర్ కమిషన్ మీడియేటర్ టీ. గోపాల్ నారాయణ తెలిపారు. కిలో డీపీటీ బియ్యం రూ.60, తెలంగాణ సోనా రూ.74, హెచ్‌ఎంటీ బియ్యం రూ.79గా ధరలు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ మేరకు బియ్యం వ్యాపారులు తమ దుకాణాల ముందు ధరల వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేశారు.షాద్‌నగర్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ధరల బోర్డులను కన్జ్యూమర్ కమిషన్ మీడియేటర్ టీ. గోపాల్ నారాయణతో పాటు రిటైర్డ్ ఆర్టీసీ కంట్రోలర్ బుచ్చయ్య, రిటైర్డ్ సీఐ అశోక్ కుమార్, అడ్వకేట్ రామ్మోహన్ పరిశీలించారు. నిర్ణయించిన ధరలకు అనుగుణంగా బియ్యం విక్రయిస్తున్న వ్యాపారులను వారు అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బియ్యం ధరలు పెరిగాయనే అపోహలను నమ్మవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయాలని సూచించారు. వ్యాపారులు నిర్ణీత ధరల కంటే అధికంగా విక్రయిస్తే తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని కోరారు. అధిక ధరలకు విక్రయించే దుకాణాలపై 1915 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే కలెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.ప్రతి వినియోగదారుడు తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ధరల విషయంలో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని షాద్‌నగర్ అండ్ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ వ్యాపారులు పారదర్శకంగా విక్రయాలు చేపట్టాలని కోరారు.

బెల్టు దుకాణాలపై సర్పంచుల నిరసన.. అధికారుల తీరుపై ఆగ్రహం

- రోడ్ల పనులు వెంటనే చేపట్టాలి.. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో సర్పంచులకు సమాచారం ఇవ్వాలి





తొలి అక్షరం/కమలాపూర్, నవంబర్ 3:హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గుండె బాబు అధ్యక్షతన మంగళవారం వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలో బెల్టు దుకాణాల నిర్వహణ, రహదారుల నిర్మాణంలో జాప్యంపై సర్పంచులు అధికారులను నిలదీశారు. గ్రామాల్లో మద్య నిషేధానికి తీర్మానాలు చేసినా బెల్టు దుకాణాలు పెరుగుతున్నాయని, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.మంజూరైన రహదారుల పనులను వెంటనే ప్రారంభించాలని, దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సర్పంచులు కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారానే జరగాలని, సర్పంచులకు తెలియకుండా ఇళ్లు మంజూరు చేయవద్దని స్పష్టం చేశారు. రైతు బీమా కొనసాగించాలని, రైతుల సమస్యలపై స్పందించాలని వ్యవసాయ అధికారులను కోరారు. విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సిబ్బంది బతుకమ్మ పండుగ సందర్భంగా అందించిన సేవలను సర్పంచులు అభినందించారు .సమావేశంలో పాల్గొన్న జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శేషాద్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల సమస్యల పరిష్కారానికి అధికారులు అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు,


సంపాదకీయం



సీఈసీపై సమరం.. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం!

● ఎన్నికల సంఘం విశ్వసనీయతపై పెరుగుతున్న ప్రశ్నలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విపక్షాల పోరాటం ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిదీ

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది. ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కును రాజ్యాంగం కల్పించింది. ఈ హక్కుకు భంగం కలగకుండా చూడాల్సిన అత్యంత కీలకమైన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. కానీ ప్రస్తుతం దేశంలో ఎన్నికల సంఘం పనితీరు, ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారశైలిపై రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)పై విపక్షాల పోరాటం మరింత ఉధృతమవుతోంది.ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానంలో ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభ విపక్షాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్‌తో చేపట్టిన ఈ ఆందోళన కేవలం ఒక వ్యక్తికి వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం మాత్రమే కాదు. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలన్న విపక్షాల డిమాండ్‌కు ప్రతిరూపంగా నిలిచింది. ఈ ఉద్యమం ద్వారా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపైనా విపక్షాలు రాజకీయ ఒత్తిడి పెంచుతున్నాయి.**ఓట్ల చోరీ అంశంతో రాజకీయ వేడి** రాహుల్‌గాంధీ మొదటి నుంచీ ఓట్ల చోరీ అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. తొలుత సొంత పార్టీలోని కొందరు నాయకులు ఈ అంశం ప్రజలను అంతగా ఆకట్టుకుంటుందా అనే సందేహాలు వ్యక్తం చేసినప్పటికీ, ఆయన మాత్రం వెనక్కి తగ్గకుండా ప్రచారాన్ని కొనసాగించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో లోపాలు, వివాదాలు వెలుగులోకి రావడంతో ఈ అంశానికి మరింత ప్రాధాన్యం పెరిగింది. ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా చర్చకు దారితీశాయి. **విపక్షాల ఐక్యతకు కొత్త వేదిక**రామ్‌లీలా మైదానంలో జరిగిన సభ ఇండియా కూటమి పార్టీలకు ఐక్యంగా పోరాడేందుకు ఒక వేదికగా మారింది. గతంలో పరస్పర విభేదాలున్న పార్టీలు సైతం ఈ అంశంపై కలిసివచ్చే పరిస్థితి ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ కూడా కూటమిలో బలమైన భాగస్వామిగా ముందుకు రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఒడిశాలోని బిజూ జనతాదళ్ ఇండియా కూటమిలో లేకపోయినా ఢిల్లీ నిరసన కార్యక్రమంలో పాల్గొనడం గమనార్హం. అయితే కూటమిలో కీలక భాగస్వామి అయిన డీఎంకే ఈ ఆందోళనకు దూరంగా ఉండటం విపక్షాల మధ్య ఇంకా కొన్ని విభేదాలు ఉన్నాయని స్పష్టం చేస్తోంది.**సీట్ల సర్దుబాటే అసలైన సవాల్**విపక్షాలు ఐక్యంగా సమావేశాలు నిర్వహించడం, నిరసనలు చేపట్టడం ఒక ఎత్తయితే, ఎన్నికల సమయంలో ఐక్యతను కొనసాగించడం మరో ఎత్తు. ముఖ్యంగా రాష్ట్రాల వారీగా సీట్ల పంపకాల్లో ప్రాంతీయ పార్టీల ప్రయోజనాలు, కాంగ్రెస్ నాయకుల వ్యక్తిగత ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇవ్వకుండా విజయమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలి. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ వరుసగా మూడోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని ఇండియా కూటమి భావిస్తోంది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ సాధించిన విజయాలు అక్కడ బలమైన ప్రతిపక్ష కూటమి ఏర్పాటుకు అవకాశాలను పెంచాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం కాంగ్రెస్‌తో పాటు మిత్రపక్షాల ముందున్న కీలక బాధ్యత. **ఓటు హక్కు బలహీనపడకూడదు**భారత రాజ్యాంగం ప్రతి వయోజన పౌరుడికి ఓటు హక్కును కల్పించింది. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరి ఓటుకు సమాన విలువ ఉండాలన్నదే ప్రజాస్వామ్య స్ఫూర్తి. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితులు ఏర్పడితే అది ప్రజాస్వామ్య మూల సూత్రాలకే విఘాతం కలిగించినట్లవుతుంది. ఎన్నికల సంఘం తన అధికార పరిధిని దాటి కొత్త నిబంధనలు లేదా విధానాల ద్వారా ఓటర్ల హక్కులకు భంగం కలిగించకూడదన్నది విపక్షాల ప్రధాన వాదన. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి అన్యాయంగా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది.**జవాబుదారీతనమే ప్రజాస్వామ్యానికి రక్షణ**ఎన్నికల ప్రక్రియలో ఏవైనా తప్పిదాలు జరిగితే వాటిపై సమగ్ర విచారణ జరగాలి. బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందన్న నమ్మకం ప్రజల్లో నిలవాలి. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవిలో కొనసాగడం, రాజీనామా చేయడం కంటే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడటం మరింత ముఖ్యం.ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికలు నిర్వహించడంతో పూర్తయ్యేది కాదు. ప్రతి పౌరుడి ఓటుకు విలువ ఉండాలి. ప్రజల తీర్పు ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ప్రతిఫలించాలి. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ఎన్నికల వ్యవస్థ పారదర్శకతకు కట్టుబడాలి. రామ్‌లీలా మైదానంలో విపక్షాలు చేసిన నినాదాలు ఆచరణలోనూ ఐక్యతగా మారితేనే ఈ పోరాటానికి సార్థకత చేకూరుతుంది. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కును కాపాడుకోవడమే అత్యంత కీలకం.



సైబర్ నేరాలపై ఉక్కుపాదం



● రికవరీ కాదు.. మూలాల ఏరివేతే లక్ష్యం ● రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్

తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),నవంబర్3: దేశ సరిహద్దులను చెరిపేస్తూ,టెక్నాలజీని అస్త్రంగా మలుచుకుని ప్రజల సొమ్మును దోచుకుంటున్న సైబర్ నేరాల మూలాలపై రాష్ట్ర పోలీసులు యుద్ధభేరి మోగించారు.కేవలం స్థానిక దర్యాప్తులతో సరిపెట్టకుండా, దేశవ్యాప్తంగా ఉన్న 13 రాష్ట్రాలు, 11 కేంద్ర దర్యాప్తు సంస్థలను ఒక్క తాటిపైకి తెచ్చి సరికొత్త వ్యూహాలకు పదునుపెట్టారు.కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ సమన్వయంతో, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని టిజిఐసిసిసి వేదికగా జాయింట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ టీమ్ ప్రాంతీయ సమావేశం అత్యంత హైలైట్‌గా జరిగింది. ఈ సదస్సును ప్రారంభించిన రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డిజిపి సి.వి. ఆనంద్.. సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు పోలీసు శాఖ అనుసరించాల్సిన విధానాలపై దిశానిర్దేశం చేశారు.

పీఎంవో సమీక్షల్లో తెలంగాణ నంబర్ వన్:

సమావేశంలో డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి కార్యాలయం నిర్వహించిన గత రెండు సమీక్షల్లోనూ దేశంలోనే సైబర్ కట్టడిలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని గర్వంగా వెల్లడించారు. దేశవ్యాప్తంగా 2024-25 మధ్య కాలంలో సైబర్ నేరాల ఫిర్యాదులు ఏకంగా 24 శాతం పెరుగుతుంటే.. మన రాష్ట్రంలో మాత్రం అవి 3 శాతం తగ్గాయని స్పష్టం చేశారు.అంతేకాకుండా దేశవ్యాప్తం గా ఆర్థిక నష్టాలు కేవలం 4 శాతమే తగ్గగా మన రాష్ట్రంలో మాత్రం ఆ నష్టాలు ఏకంగా 20 శాతం మేర తగ్గాయని ఆయన గణాంకాలతో సహా వివరించారు.





ఇకపై రికవరీ కాదు..నేరానికే చెక్ పెట్టాలి:

సైబర్ నేరాల తీరుతెన్నులపై డీజీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నేరం జరిగిన తర్వాత గొలుసు చివర ఉన్న డబ్బును వెతికి పట్టుకోవడంపైనే ఇప్పటివరకు ఎక్కువ దృష్టి పెట్టామని, ఇకపై ఆ పద్ధతి పూర్తిగా మారాలని ఆయన తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా డీజీపీ ఆనంద్ తనదైన శైలిలో స్పందిస్తూ.. సైబర్ నేరం ఇప్పుడు ఒక వ్యవస్థీకృత పరిశ్రమగా మారింది. మనం నేరం జరిగాక డబ్బు రికవరీ చేయడం గురించి ఆలోచించడం ఆపాలి. అసలు ఆ నేరమే జరగకుండా మూలాల నుంచే నిరోధించాలి. నేరగాళ్లకు బాధితుడు నేరుగా దొరికే మార్గం ఉండకూడదు. వారికి నకిలీ ఫోన్ నంబర్లు, మోసాలకు వాడుతున్న మ్యూల్ ఖాతాలు ఏవీ అందకుండా సాంకేతికంగా పూర్తిగా కట్టడి చేయాలి“ అని గట్టిగా పిలుపునిచ్చారు.

కేంద్ర, రాష్ట్రాల సంయుక్త వేట:

దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య సమన్వయం లేకపోవడాన్ని నేరగాళ్లు ఆసరాగా చేసుకుంటున్నారని, దీనికి చెక్ పెట్టేందుకే ఈ జెసిసిటీ -IV సమావేశం దోహదపడుతుందని డీజీపీ పేర్కొన్నారు.ఈ సదస్సులో చర్చించిన ప్రతి అంశాన్ని, తీసుకున్న కీలక నిర్ణయా లను నేరుగా ఢిల్లీకి తీసుకెళ్తామని.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా ఒకే రకమైన ఏకీకృత కఠిన చర్యలు చేపడితేనే ఈ సైబర్ భూతాన్ని తరిమికొట్టగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

బాధితులు ఒక్క నిమిషం ఆలస్యం చేసినా ముప్పే:

సైబర్ మోసాలపై అధికారులు మరోసారి ప్రజలను అప్రమత్తం చేశారు. ఎవరైనా ఆర్థిక సైబర్ మోసానికి గురైతే ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్ www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రతి నిమిషం ఎంతో కీలకమని, తక్షణమే స్పందిస్తేనే మోసపోయిన సొమ్మును రికవరీ చేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి పునాది!

ప్రజల చేతిలోనే పాలకులను ఎన్నుకునే అధికారం ప్రతి ఓటుకు సమాన విలువ ఉండాలి ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాతమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ప్రాణవాయువు వంటిది. ప్రజలు తమ భవిష్యత్తును నిర్ణయించుకునేందుకు, తమకు నచ్చిన పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు ఓటు. ఈ హక్కు ద్వారానే సామాన్య పౌరుడు దేశ పాలనలో భాగస్వామి అవుతాడు. ధనికుడు, పేదవాడు, ఉన్నతుడు, సామాన్యుడు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరి ఓటుకు సమాన విలువ ఉండటమే ప్రజాస్వామ్య గొప్పతనం. అందుకే ఎన్నికలు కేవలం అధికార మార్పిడికి సంబంధించిన ప్రక్రియ కాదు.. ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలు, ఆశయాలకు ప్రతిరూపం.భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందింది. ఇంతటి విస్తృతమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైన బాధ్యత. ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఓటర్ల జాబితాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడటం, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవడం ఎన్నికల సంఘం బాధ్యత. ఈ ప్రక్రియపై ప్రజలకు నమ్మకం ఉన్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది.**ఓటు హక్కుపై పెరుగుతున్న చర్చ**ఇటీవలి కాలంలో దేశంలో ఓటర్ల జాబితాల సవరణ, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై రాజకీయంగా తీవ్ర చర్చ జరుగుతోంది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోతున్నాయంటూ ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల ప్రక్షాళనను ఎన్నికల ప్రక్రియలో భాగంగా వివరిస్తోంది. ఈ నేపథ్యంలో అర్హులైన ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జాబితాల్లో పేర్లు తొలగించే ముందు సరైన పరిశీలన, సంబంధిత ఓటర్లకు సమాచారం, అభ్యంతరాలు తెలియజేసేందుకు తగిన అవకాశం కల్పించాలి. **రాజకీయాలకు అతీతంగా ఓటు విలువ**ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రజలకు అనేక హామీలు ఇస్తుంటాయి. అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, విద్య, వైద్యం, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలను తమ ప్రచారంలో ప్రస్తావిస్తాయి. అయితే ఓటర్లు కూడా అభ్యర్థుల మాటలను మాత్రమే కాకుండా గతంలో వారు చేసిన పనులను పరిశీలించాలి. ప్రజా సమస్యలపై వారి వైఖరి, ప్రజలకు అందుబాటులో ఉండే తీరు, ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలను బేరీజు వేసుకుని ఓటు వేయాలి. కులం, మతం, ప్రాంతం, డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లొంగకుండా స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలి. **యువ ఓటర్లదే కీలక పాత్ర**దేశ భవిష్యత్తును నిర్ణయించడంలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనది. తొలిసారిగా ఓటు హక్కు పొందిన యువత ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు ప్రచారాలు, నిరాధార వార్తలను నమ్మకుండా వాస్తవాలను పరిశీలించాలి. అభ్యర్థుల సామర్థ్యం, వారి విధానాలు, ప్రజా సమస్యలపై వారి నిబద్ధతను అర్థం చేసుకుని ఓటు వేయాలి. యువత ఎన్నికల్లో చురుగ్గా పాల్గొన్నప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థలో కొత్త ఆలోచనలు, మార్పులకు అవకాశం ఏర్పడుతుంది.



ఎన్నికల సంఘం బాధ్యత మరింత కీలకంఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. అధికారంలో ఉన్న పార్టీకి కానీ, ప్రతిపక్షాలకు కానీ అనుకూలంగా వ్యవహరిస్తోందనే అనుమానాలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ చేపట్టాలి. ఓటర్ల జాబితాల రూపకల్పన నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలో పారదర్శకత ఉండాలి. ఎన్నికల అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ పార్టీలు చేసే ఆరోపణలకు ఆధారాలతో సమాధానాలు ఇవ్వాలి. ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని కాపాడటం అత్యంత ప్రాధాన్యమైన అంశం. **ఓటు వేయడం హక్కే కాదు.. బాధ్యత కూడా**చాలామంది ఓటు వేయడాన్ని సాధారణ కార్యక్రమంగా భావించి నిర్లక్ష్యం చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం పెంచాల్సిన అవసరం ఉంది. ఎన్నికల రోజున సెలవుగా భావించి కాలక్షేపం చేయకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఒక్క ఓటుతోనే ఫలితాలు మారిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అందువల్ల ప్రతి ఓటరు తన ఓటు విలువను గుర్తించాలి. ఓటు వేయకపోవడం ద్వారా మంచి పాలనను కోరుకునే హక్కును బలహీనపరచకూడదు. ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కావాలంటే ఓటు వేయడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యతగా భావించాలి.**ప్రజాస్వామ్య పరిరక్షణ అందరి బాధ్యత**ఎన్నికల్లో గెలుపోటములు సహజం. ఒక పార్టీ గెలుస్తుంది, మరో పార్టీ ప్రతిపక్షంలో కూర్చుంటుంది. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థ మాత్రం అందరికీ సమానంగా ఉంటుంది. ఎన్నికల ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు వేదికగా మార్చకుండా అన్ని పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రజల తీర్పును గౌరవించాలి. ఓటర్ల హక్కులకు భంగం కలగకుండా చూడాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు కేంద్ర బిందువుగా ఉండాలి.

Editor Pastham Saidulu, Tholi Aksharam, PRGI No. TGMUL/25/A1386, Printing : R.R. GRAPHICS, H.No. 1-8-747/11/45, Street No. 27, Near Sundaraiah Park, Nallakunta, Hyderabad, Cell No: 8074571329, Telangana State, India.